క్లుప్తంగా

నేడు దుకాణాల సముదాయాలకు వేలం

మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లి, మొగుళ్లపల్లి రెండు గ్రామాల మధ్య జరిగే మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాల సముదాయాలకు సోమవారం దేవాదాయశాఖ అధికారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జాతర ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జాతరలో బెల్లం, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరికాయ చీటీలు, కోళ్లను అమ్ముకొనేందుకు, తదితర దుకాణాల సముదాయాలకు నిర్వహించే బహిరంగ వేలం పాటలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



మల్హర్: మండలంలోని తాడిచర్ల వేంకటేశ్వర ఆలయంలో వాసవిక్లబ్, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వాసవీ ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాత చిత్రపటానికి పూలమాలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు సతీష్, అశోక్, హరీష్, వాసవి, వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఎస్సై బదిలీ

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎస్సై జే.లక్ష్మణ్‌రావు ఆదివారం బదిలీ అయ్యారు. గత మూడేళ్లుగా కాళేశ్వరం పరిధిలో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. ముఖ్యంగా ప్రాణహిత పుష్కరాలు, మహాశివరాత్రి, గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఆయన తనదైనశైలిలో విధులు నిర్వర్తించి మన్నలు పొందారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్‌లోని పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా బదిలీపై వెళ్లారు. ఈ మూడేళ్ల కాలంలో తనకు సహకరించిన ప్రజలకు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం



కాటారం : మండల కేంద్రంలోపి ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలోని చిద్నెపల్లి క్రాస్ వద్ద క్షుద్రపూజలు కలకలం నెలకొంది. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలకు పాల్పడినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. పసుపు, కుంకుమ, టెంకాయలు, నిమ్మకాయలతో కూడిన క్షుద్రపూజల రీతిలో పూజలు చేసి కోడిని బలిచ్చినట్లు కనిపించింది. నిత్యం బిజీగా ఉండే రహదారిపై ఇలాంటి క్షుద్రపూజలు జరిగాయి. ఉదయం అటు వైపుగా వెళ్లిన వాకర్స్ క్షుద్ర పూజల తంతును చూసి ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో ఇలాంటి క్షుద్ర పూజలు జరుగుతుండటంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయండి

గోవిందరావుపేట: త్వరలోనే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పైన న్యాయమైన తీర్పు వెలువడుతుందనే నెల 13న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యే జాతీయ కార్యవర్గ సమావేశానికి మండల కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తోకల రాంబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, వీహెచ్‌పీఎస్, ఎంఎల్ఎఫ్, ఎంజేఎఫ్, ఎంవైఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భాస్కర్‌రెడ్డి



ములుగు రూరల్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జి ల్లా కేంద్రానికి చెందిన చింతలపూడి భాస్కర్‌రెడ్డిని నియమించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తగా నాయకుడిగా సేవలు అందించిన భాస్కర్‌రెడ్డి నియామకం పలువురికి ఆదర్శమని అన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తకు పదవులు వస్తాయని అన్నారు. ములుగు నుంచి ఆర్‌ఎస్ఎస్ స్వయం సేవక్‌గా, బీజేవైఎం వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, ములుగు మండల అధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడిగా పలు దఫాలు పార్టీ సేవలు అందించారని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించి బీజేపీని గెలిపించేలా కృషి చేయాలని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



మలుపువద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



కోతకు గురైన రోడ్డు

- ప్రమాదకరంగా కోతకు గురైన రోడ్డు
- పట్టించుకోని అధికారులు

మహాముత్తారం: గతంలో కురిసిన వర్షాలకు మండలంలోని నల్లగుంటమీనాజీపేట నుంచి ఆజాంనగర్ వెళ్లే ప్రధానరహదారిలో రెండు మూడు మూల మలుపుల వద్ద రోడ్డు కోతకు గురైంది. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానరహదారి కావడంతో పాటు మేడారం వెళ్లే వాహనాలు కూడా ఈ రహదారి గుండా వెళ్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

సీపీఐ పోరాట ఫలితమే కారల్‌మార్క్స్ కాలనీ ఏర్పాటు

- సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

భూపాలపల్లి రూరల్: నాడు సీపీఐ కమ్యూనిస్టుల పోరాట ఫలితమే నేడు కారల్ మార్క్స్‌కాలనీ ఏర్పడిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీ 24, 25 వార్డు కమిటీల సీపీఐశాఖ సమావేశాలు నిర్వహించారు క్యాతరాజు సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశాలకు రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా అన్నారు. ఎర్ర జెండాను నమ్మితే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కారల్‌మార్క్స్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సీపీఐ ప్రత్యేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కాలనీ అంటేనే కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేదన్నారు. కాలనీలో నెలకొన్న డ్రెయినేజీ మంచినీటి సమస్యలపై సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గత పోరాటాల ఫలితం వల్లనే ఈ రోజు కాలనీ ఇంత అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకం అమలు చేసే కంటే ముందే పేదలకు తెల్లరేషన్ కార్డులు అందజేయాలని కోరారు. గత ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని తెలిపారు. ఈ నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. కాలనీలో ఇప్పటివరకు నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని ఈ ప్రభుత్వం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందించి వెంటనే ఇళ్ల పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెండు వార్డుల సీపీఐ శాఖ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, జిల్లా సమితి సభ్యులు కొరిమి సుగుణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్, నాయకులు గంగసరపు శ్రీనివాస్, తాళ్ల పోశం, వెంకటేశ్వర్లు, సింహాద్రి, సంధ్య, రజిత సమత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



మొగుళ్లపల్లి : విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది



కాటారం : పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఏటూరునాగారం : బాలికల జూనియర్ కళాశాల వద్ద గుమికూడిన తల్లిదండ్రులు



ఏటూరునాగారం : విద్యార్థిని తనిఖీ చేస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది

మొగుళ్లపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నడుస్తున్న గురుకుల పాఠశాలలలో 5వ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్ అలుబోజు వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా గురుకులంలోని పరీక్ష కేంద్రంలో 5వ తరగతికి ప్రవేశ పరీక్ష నిర్వహించగా 240 మంది విద్యార్థులకు 221 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షహాల్‌ను ఎస్సై మాధవ్ గౌడ్ పర్యవేక్షించారు.

కాటారం: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, బాలికల పాఠశాల, గంగారం మోడల్ స్కూల్ పాఠశాల కేంద్రాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాలుర పాఠశాల కేంద్రంలో 288 మంది విద్యార్థులకు 259 మంది, బాలికల పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను 217 మంది, గంగారం మోడల్ పాఠశాలలో 374 మంది విద్యార్థులకు గాను 333 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు శైలజ, బుచ్చయ్య, మధు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన ఐదో తరగతి గురుకులం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిశాయి. డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 205 మంది విద్యార్థులకు 193 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. వీటీజీసెట్ పరీక్షలు ఎలాంటి ఇబ్బంది లేకుండా జరిగినట్లు తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రవికిరణ్, సిట్టింగ్ స్క్వాడ్ రవీందర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. అలాగే గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో వీటీజీ సెట్ కోసం నిర్వహించిన అర్హత పరీక్ష ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర తెలిపారు. తమ పరీక్ష కేంద్రంలో 320 మంది విద్యార్థులకు కేటాయించగా 296 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు. విద్యార్థులతో తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడారు. దీంతో నిర్వాహకులు గేటుకు తాళం వేసి అందరిని బయటకు పంపించి వేశారు. వారి పిల్లలు పరీక్ష రాసి వచ్చే వరకు తల్లిదండ్రులు పడిగాపులు కాశారు.ఎలాంటి నీడను, తాగునీటి వసతి కల్పించలేదని అసహనం వ్యక్తం చేశారు.

గ్యాస్ సిలిండర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తప్పుగా నమోదు చేసుకున్న బాధితులతో ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని చల్వాయిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఒకటైన రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని అర్హులైన అందరూ సద్వినియోగం చేసుకోవాలని, అమలులో భాగంగా చల్వాయి గ్రామ ప్రజలు 2080 మంది దరఖాస్తు పెట్టుకున్నారని ఎంపీడీఓ, చల్వాయి స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అందులో 488 మంది తప్పుగా నమోదు చేసుకున్నారు, తప్పుగా చేసుకున్న వారు మళ్లీ గ్యాస్ నంబర్ నమోదు చేసుకోవచ్చని, తప్పుగా నమోదు చేసుకున్న వారికి చల్వాయి మాజీ ఉప సర్పంచ్ తేళ్ళ హరి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిక్కుల వెంకటేష్ సలహాలు, సహాయం చేయగా మళ్ళీ దరఖాస్తులో గ్యాస్ కన్స్యూమర్ నంబర్‌ను సరి చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి, సిబ్బందికి అందజేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో చల్వాయి గ్రామ కార్యదర్శి భారతి, ప్రజలు పాల్గొన్నారు.

పద్మశాలీ వివాహ పరిచయ వేదికకు స్పందన



పరిచయ వేదికలో పాల్గొన్న నాయకులు

వరంగల్: తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలీ వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. సుమారు 400మంది పద్మశాలి కులస్తులు హాజరైనట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పద్మశాలీ యువతీ యువకులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎనిదేళ్లుగా సేవా దృక్పథంతో పద్మశాలి మ్యారేజ్ బ్యూరోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ అధ్యక్షతన జరిగిన పరిచయ వేదికలో సంఘం మ్యారేజ్ బ్యూరో రాష్ట్ర కన్వీనర్ లకుం నవీన్, రాజ్‌కుమార్, పిట్ట ఉమాదేవి, ఆడెపు నాగరాజు, బూర తిరుపతయ్య, బింగి సురేష్, గొట్టిముక్కల నాగసాగర్, రాజమౌళి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొలిపాక మధు డిమాండ్ చేశారు. హనుమకొండలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులందరిని రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి కొందరినే క్రమబద్ధీకరించి ఒకేషనల్ జూనియర్ కళాశాలల అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ కోదండరాం పిలుపు మేరకు ఆనాడు ఉద్యమంలో తాము భాగస్వాములమయ్యామని గుర్తుచేశారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులందరిని క్రమబద్ధీకరించాలని కోరారు.

పల్లె ప్రకృతి వనాల్లో ఎండుతున్న మొక్కలు

- అస్తవ్యస్తంగా నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



బీసీ మర్రిగూడెంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం



ఎండిపోయిన మొక్కలు

వెంకటాపురం(కె): పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చేపట్టింది. కానీ క్షేత్రస్థాయిలో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వాంగా తయారైంది. ఊరి చివర పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి వదిలేయటంతో మొక్కలు ఎండిపోయి పిచ్చి చెట్లకు నిలయాలుగా మారాయి. పల్లె ప్రకృతి వనాలపై అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండలంలో 18 పంచాయతీల్లో ప్రభుత్వం ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వాటిలో రకరకాల మొక్కలను నాటి ఆహ్లాదక ర వాతావరణం నెలకొనేలా చర్యలు చేట్టారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పంచాయతీ అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎండిపోతున్న మొక్కలు

హడావుడిగా అధికారులు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి మొక్కలు నాటించారు. పంచాయతీలోని ప్రజలు పల్లె ప్రకృతి వనాలకు వచ్చి సేద తీరేలా చర్యలు చేపట్టారు. కాగా పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలకు నీళ్ల పట్టే వారు కరువయ్యారు. దీనికి తోడు పల్లె ప్రకృతి వనాలపై ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో పాటు పంచాయతీ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం కారణంగా పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలు ఎండి పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించి ప్రకృతి వనాల్లోని మొక్కలు బతికించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మిర్చి చోరీ..



కల్లంలో మిర్చిని చూపుతున్న బాధితురాలు

చిట్యాల: మండలంలోని కైలాపూర్ గ్రామ శివారులో కల్లంలోని ఆరు క్వింటాళ్ల మిర్చి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితులు తెలిపిన ప్రకారం..మండలంలోని కై లాపూర్‌కు చెందిన బూర్గుల రాయకొమురు, బోయిని సమ్మయ్య వారు పండించిన మిర్చి పంటను తమ పంట చేను వద్ద ఆర పోసుకున్నారు. రోజు తమ పంట చేను వద్ద తాలు కాయలు ఏరుతూ ఎండినమిర్చిని కుప్ప పోసుకున్నారు. దీనినరి ఆసరాగా చేసుకొని దుండగులు బూర్గుల రాయకుమురు 5 క్వింటాళ్లు, బోయిని సమ్మయ్య 2 క్వింటాళ్ల మిర్చి చోరీకి గురైనట్లు బాధితులు పోలీస్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి కిశోర్ ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆయన మృతదేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌గా కిశోర్ చేసిన సేవలు చిరస్మరణీయమని వెల్లడించారు. పరామర్శించిన వారిలో మండలపార్టీ అధ్యక్షులు మన్నెం ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కేతిపల్లి స రోజన, కనుకుంట్ల జీవన్ రావు, కేతిపల్లి శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీ దుబాసి శ్రీలతరాధాకృష్ణ, నాయకులు దామెర శంకర్, కిన్నెర రమేష్, లింగమూర్తి, హింగె బా బురావు, ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

కాటారం: విద్యార్థులను గురుకులం ప్రవేశ పరీక్షకు తీసుకొచ్చిన ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడు గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. గోరి కొత్తపల్లికి చెందిన పకెడ రాజ్‌కుమార్(40) స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఉండటంతో పాఠశాలకు చెందిన విద్యార్థులను పరీక్ష రాయించడం కోసం కాటారం గురుకుల పాఠశాలకు తీసుకొచ్చారు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి పంపించిన రాజ్‌కుమార్ పరీక్ష కేంద్రం బయట సేద తీరుతూ అకస్మాత్తుగా కింద పడిపోయాడు. గమనించిన పలువురు 108కి సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకొని గుండెపోటుకు గురైనట్లు నిర్ధారించారు. ప్రథమ చికిత్సను అందించిన 108 సిబ్బంది మెరుగైన వైద్యం కోసం 108లో భూపాలపల్లి తరలిస్తుండగా రాజ్‌కుమార్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



పిచ్చయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

మంగపేట: గ్రామ అభివృద్ధికోసం కృషి చేస్తానని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని అకినేపల్లిమల్లారం ఎస్టీ కాలనీలో మంత్రి వ్యక్తిగత సహాయకుడు, బంధువులు లక్కి అనిల్ రాజు ఇంట్లో జరిగిన లక్కి పిచ్చయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి మంత్రి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మృతుడు పిచ్చయ్య చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు మంత్రి సీతక్కకు వివరించి పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆమె గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృసిచేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్క వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మౌల జయరాంరెడ్డి, నాసిరెడ్డి సాంబశివరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం జెడ్పీటీసీ నామకరణ్‌చందు, లక్కి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాజాతర ఉత్సవ కమిటీ సభ్యుడిగా అబ్బయ్య



రాజారత్నం



కోరం అబ్బయ్య

మంగపేట: ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన మహాజాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఉత్సవ కమిటీ సభ్యుడిగా మండలంలోని చుంచుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోరం అబ్బయ్య నియమితులయ్యారు. మంత్రి సీతక్క ప్రతిపాదనల మేరకు దేవాదా యశాఖ 15 మందితో కూడిన ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా అర్రెం లచ్చుపటేల్‌తో పాటు కమిటీ సభ్యులుగా 14 మంది పేర్లతో దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మండలానికి చెందిన ఆదివాసీ గిరిజన సామాజిక వర్గానికి చెందిన అబ్బయ్యతో పాటు రాజుపేటకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గంగెర్ల రాజారత్నంకు చోటు లభించింది. కమిటీలో తమకు సభ్యులుగా అవకాశం కల్పించిన మంత్రి సీతక్క, సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొడిశలకుంట కాంగ్రెస్ అధ్యక్షుడిగా మోహన్



ములుగు రూరల్: కొడిశలకుంట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా బానోత్ మోహన్‌ను నియమిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ తెలి పారు. ఆదివారం నూతన అధ్యక్షుడికి నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, రాంమోహన్, సురేష్, బాలాజీ, జోద్యా, నరసింహ, విజేందర్, భూపాల్‌రెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.